# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-07-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కూటమి ప్రభుత్వం రాయలసీమను రతనాల సీమగా మారుస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

2. **అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు.**

3. **ఈనెల 14వ తేదీతో ఎస్ఐఆర్ కార్యక్రమం గడువు ముగుస్తుందని నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.**

4. **ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.**

==========================

కూటమి ప్రభుత్వం రాయలసీమను రతనాల సీమగా మారుస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం గ్రామీణం రాచపల్లి వద్ద హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణతో కలిసి మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 750 కోట్ల రూపాయలతో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. 2014-19 సంవత్సరాల మధ్య కాలంలో రాయలసీమకు ఇరిగేషన్ రంగంలో 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు.

-------------------------

కుల, మత, ప్రాంత, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి – సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలోని ఆయన క్యాంపు కార్యాలయంలో 60 మంది లబ్ధిదారులకు 59 లక్షల 42 వేల 204 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నిన్న అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల పాలిట ముఖ్యమంత్రి సహాయ నిధి కల్పతరువుగా నిలిచిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో నిరుపేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని చెప్పారు.

-------------------------

ప్రజాస్వామ్య మనుగడకు అర్హులైన వారికే ఓటు హక్కు ఉండాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 25 ప్రచార ఆటోలను కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరపత్రాల పంపిణీతో పాటు పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, ఓటు హక్కు నమోదు చేసుకోని వారు వెంటనే ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

---------------------------

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారంను తప్పనిసరిగా సమర్పించాలని నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రాజకుమారి కోరారు. నంద్యాలలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 14వ తేదీతో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగుస్తుండటంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా కోసం ప్రజలు, పార్టీలు, అధికారులు సహకరించాలని కలెక్టర్ రాజకుమారి తెలియజేస్తూ...

వాయిస్..25 సెకన్లు

---------------------------

తిరుపతిలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ఈరోజు పరిశీలించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సర్ ప్రక్రియను పరిశీలించి త్వరితగతిన ఓటరు నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆన్ లైన్‌లో కూడా ఓటరు సవరణ చేసుకోవచ్చునని.. 2002 సంవత్సరంలో ఎక్కడైతే ఓటు వేశారో ఆ ఓటరు కార్డుకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా బీఎల్వోల వద్దకు తీసుకెళ్ళాలన్నారు.

---------------------------

వియత్నాం పడవ ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను, గాయపడిన వారిని, ఇతర తెలుగు పర్యాటకులను స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రమాద ఘటనకు సంబంధించి ఆయన అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ప్రమాదంలో గాయపడిన గెల్లె కిషోర్ ప్రస్తుతం వియత్నాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలు స్వస్థలాలకు తరలించేందుకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ఒక ఏజెన్సీని నియమించినట్లు అధికారులు చెప్పారు. భౌతిక కాయాల అప్పగింత, తరలింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన పర్యాటకులను ఇవాళ విమానాల ద్వారా తమ స్వస్థలాలకు తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతూ మైసూరులోని అపోలో ఆసుపత్రిలో నిన్న తుదిశ్వాస విడిచారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో 1938వ సంవత్సరం ఏప్రిల్ 23వ తేదీన జన్మించిన ఎస్. జానకి, ఆరు దశాబ్దాలకు పైగా భారతీయ సినీ సంగీత రంగానికి విశిష్ట సేవలందించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు పలు భాషల్లో 48 వేలకుపైగా పాటలు ఆలపించి విశేష గుర్తింపు పొందారు.

.. వాయిస్.. 25 సెకన్లు

ఎస్. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ప్రజల సందర్శనార్థం ఆమె పార్థివ దేహాన్ని సాయంత్రం వరకు మైసూరులోని మహారాజా కళాశాల మైదానంలో ఉంచుతారు.. ఈ సాయంత్రం మైసూరులోని బోగాది సమీపంలో కణియర హన్డి గ్రామంలో అధికారిక గౌరవ లాంఛనాలతో అంతిమయాత్ర.. అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబసభ్యులు తెలిపారు. వేలాది మధుర గీతాలతో సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఆమెకు అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

విశాఖపట్నం నగరంలో ఈరోజు తెల్లవారుజామున పలు ప్రాంతాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు వాతవరణశాఖ తెలిపింది. సీతమ్మధార, సాగర్ నగర్, తాటిచెట్లపాలెం, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్ బీ కాలనీ, మాధవధార, పెదవాల్తేరు తదితర ప్రాంతాల్లో భూమి ఒక్కసారిగా కంపించిందని పేర్కొంది. భూకంప తీవ్రత రెక్టర్ స్కేల్ పై 4.5గా నమోదైందని వెల్లడించింది. గాజువాక, ఎంవీపీ కాలనీ, అప్పుఘర్ ప్రాంతాల్లో ఏడు సెకండ్ల పాటు భూమి కంపించిందని ఆ ప్రాంత వాసులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీనిఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

=====================